# 4. దోపిడి

నాగభూషణం నడుస్తున్న వాడల్లా ఒక్కసారిగా ఆగిపోయాడు ఆ భవంతిని చూచి.

నాగభూషణం ఆ రోడ్డుమీదే అప్పటికి కనీసం మూడేళ్ళ నుంచైనా నడక సాగిస్తూ వున్నాడు. ఆఫీసుకు పోవడం, రావడం అన్నీ ఆ రోడ్డుమీదనే. ఇంతక్రితం ఎన్నోసార్లు అతను ఆ భవంతినిచూశాడు. కానీ ఎప్పుడూ-ఎప్పుడూ యిలా ఉలికి పడలేదు. ఆ భవంతిని అన్ని రోజులూ ఒకే విధంగా చూసినా, ఈరోజు మాత్రమే అతనికా భవంతి ఆశ్చర్యాన్ని కలగ జేసింది. ఇంతకాలమూ ఆ భవంతిని తనెందుకు సరిగా గుర్తించ లేకపోయాడో నాగభూషణానికే అర్థం కాలేదు.

ఆ భవంతి మీద అందమైన బోర్డుంది. ఆ బోర్డుమీద మరింత అందంగా వున్న అక్షరాలూ వున్నాయి. ఆ అక్షరాలన్నీ ఒకసారి కూడ బలుక్కుని చదువుకున్నాడు నాగభూషణం: 'మానెటరీ బ్యాంకు లిమిటెడ్',

ఆ క్షణంలో ఆ అక్షరాలన్నీ అతని కెన్నో కథలు చెబుతున్నట్లుగా అనిపించింది.

నాగభూషణం ఒకసారి ఉలికి పడ్డాడు. తన నెవరైనా చూశారా అని. క్షణం తరువాత తన్ను తానే తమాయించుకుని ముందుకు కదిలాడు. ఆ బాంక్ భవంతికేసి, అత నొకసారి మళ్ళీ చూశాడు ఆశగా!

నాగభూషణం చేస్తున్న ఉద్యోగం దేశంలో చాలామంది చేస్తున్నదే గుమాస్తాగిరి! నాగభూషణం చేస్తున్న జీవనం దేశంలో చాలామంది చేస్తున్నదే మధ్య తరగతి.

కానీ, నాగభూషణం ఆలోచనలు మాత్రం, దేశంలో చాలామందికి తట్టవు. దేశంలో చాలా మందికి అలాంటి ఆలోచనలు ఉంటాయనే తెలియదు. పొరబాటున అలాటి ఆలోచనలు వస్తే, చాలామంది ఉలిక్కిపడతారు.

నాగభూషణం ఎంత చెడ్డవాడైనా మరీ అంత చెడ్డవాడు కాదు. అతను ఆ రోజు పొద్దున్నే నిద్ర లేవగానే పేపరు చూశాడు మామూలుగా, మొదటినుంచీ చివరి వరకూ ఒకసారి చదివి, టేబిల్ మీదకు విసిరేసి, వెళ్ళి మొహం కడుక్కొని, తీరికగా కాఫీ తాగి, మళ్ళీ పేపరు చదివాడు. చదివి, వెళ్ళి బాత్‌రూమ్‌లో దూరాడు స్నానం కోసం.

స్నానం చేస్తూంటే, నాగభూషణం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. వెంటనే స్నానం 'షార్ట్‌కట్' లో చేసేసి, తడి ఒంటిమీద తువ్వాలు అలా చుట్టుకొని వచ్చి, టేబిల్‌మీది పేపరు అందుకున్నాడు. ఈ సారి పేపరు అంతా చదువక, ఆ కొంచెం చదివాడు. నాగభూషణంలో రక్తం చలనం కొంచెం పెరిగింది.

నాగభూషణాన్ని అంతగా ఆకర్షించిన వార్త, నాగభూషణానికి సంబంధించినదీ కాదు, వాళ్ళ ఊరి వార్తా కాదు! ఎక్కడో దేశంలో ఏదో ఓ మూల జరిగిన సంఘటన అది. ఆ ఊళ్లో ఉన్న బాంక్‌ను ఎవరో దోచేశారట. దోచేసి ఓ రెండు లక్షలు తమ సొంతం చేసుకున్నారట! అంతే వార్త నాగభూషణం చదివాడు.

ఒకసారి ... రెండోసారి .. మూడు సార్లు చదివాడు నాగభూషణం. ఆ వార్త చదువుతున్న కొద్దీ నాగభూషణానికి అందులో కొత్త అర్థాలూ, ఆదర్శాలూ కనిపించాయి.

తనలో రూపం దిద్దుకుంటున్న ఆలోచనలకు భయపడి నాగభూషణం ఒకసారి ఇంటి బయటికొచ్చి నిలబడ్డాడు. నాగభూషణానికి ఎదురుగా ఉన్న

మానెటరీ బాంక్ భవంతి కనపడింది. నాగభూషణం ఇంకోసారి ఉలికిపడి ఇంట్లోకి వచ్చాడు. ఇంట్లో ఎదురుగా టేబిల్ మీద పేపర్....

పేపర్లో వార్త....

వార్తలో అర్థాలు....

నాగభూషణం అశాంతిగా అటూ ఇటూ తిరిగాడు.

ఏ పని చేస్తున్నా అతని ఆలోచనలు అయాచితంగా ఆ వార్త వైపు సాగిపోవటం ప్రారంభించాయి.

ఇంక ఇంట్లో నిలవలేక నాగభూషణం రోజూ కన్నా ముందుగానే ఆఫీసుకు బయలుదేరాడు.

నాగభూషణం ఆఫీసుకు వెళ్ళాలంటే ఆ రోడ్డుమీదనుంచే వెళ్ళాలి. ఆ రోడ్డుమీద మొదటి భవంతి అదే. ఆ రోజు అతను అక్కడకు రాగానే ఎవరో అతన్ని తట్టి ఆపినట్లుగా ఆగిపోయాడు.

ఆ భవంతి అతన్ని రెండు చేతులు చాచి ఆహ్వానిస్తున్నట్లుగా అనిపించింది అతనికి.

నాగభూషణానికి స్పష్టంగా అర్థంఅయిపోయింది-తన మనసు ఏటు వైపు పోతుందో!

నాగభూషణం మడికట్టుకున్న మనిషి కాదు. ఆఫీసులోంచి ప్రైనప్పుడల్లా పేపర్లు, పెన్సిళ్ళు, రబ్బర్లు తెచ్చుకునేవాడు మొదట్లో. ఆ పని మొట్టమొదట చేసినప్పుడు అలాటి పని తనొక్కడే చేస్తున్నట్లుగా ఎంతో బాధ పడ్డాడు. కానీ, అలా ఆఫీసులోంచి దాదాపుగా అందరూ పేపర్లు, పెన్సిళ్ళు ఇళ్ళకు తీసుకువెడతారని తెలిశాక, ఒకసారి దీర్ఘంగా నిట్టూర్చుకొన్నాడు. ఆ తరవాత ఒకసారి ఎవరో ఓ ఆసామీ వచ్చి, తన కష్టాలన్నీ చెప్పుకొని, నాగభూషణం చేయాల్సిన పని చెప్పి, ఆ పని

చేసినందుకు ఇచ్చిన లంచాన్ని తీసుకున్న రోజునా నాగభూషణం అలానే అనుకున్నాడు. తనెంతగనో దిగజారి పోతున్నట్లుగా, నైతిక పతనం అయిపోయినట్లుగా అనుకొన్నాడు. కానీ, ఆ లంచం తీసుకోవటమనే పని తనకు కుడి, ఎడమ, ఎదురుగా, వెనకగా కూర్చునే సహోద్యోగులు అందరు చేస్తున్న పనే అని తెలుసుకుని, నిశ్చింతంగా ఉండిపోయాడు. ఇంతే కానీ నాగభూషణం ఇంతకన్నా ఇంకే పాపమూ ఎరగడు ఇంతకాలమూ!

కానీ, నాగభూషణం ఆశావాది. దేశంలో ఏదో ఓ రోజున సోషలిజం అనేది వస్తుందనీ, ఆ రోజున ప్రభుత్వం వారే టాటా, బిర్లా డబ్బులన్నీ దేశంలో ఉన్న అందరికీ వాటాలు వేసి పంచేస్తారని ఇంత కాలమూ కలలు గంటూ వచ్చాడు. కానీ, దేశంలో సోషలిజం అనేది ఇప్పుడప్పుడే రాదనీ, అధవా వచ్చినా తన వాటాకు ఏ రూపాయో, రెండో మాత్రమే వస్తాయనీ ఇప్పుడిప్పుడే గ్రహించాడు నాగభూషణం. అందుకే నాగభూషణం ఆలోచనలు హఠాత్తుగా ధనికవర్గంలో తనూ ఒకడిగా చలామణీ అయిపోవాలనే ఆశయం చుట్టూనే తిరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో కొంచెం సాహసం ప్రదర్శించి అయినా, అదీ అవసరం అయితేనే, జన్మ అంతా సుఖపడి పోవాలనే కాంక్ష అతనిలో దావానలంలా ప్రజ్వరిల్లుతూంది.

ఆఫీసులో ఉన్నంతకాలమూ అన్య మనస్కంగా పనిచేసి ఆఫీసరు చేత నాలుగు చీవాట్లు తిని, అర్ధరోజుకు కాజువల్ లీవు పెట్టి, ఇంటి కొచ్చేశాడు నాగభూషణం. ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు ఒకసారి బాంక్ భవంతిలోకి వెళ్ళాడు. వెళ్ళి, ఎవరికీ అనుమానం కలగకుండా ఉండేందుకు ఆ బాంక్‌లో తనకో అకౌంట్ ఓపెన్ చేసుకున్నాడు. దానితో అతనికి ఆ బాంక్‌లోకి ఏ క్షణంలో అంటే ఆ క్షణంలో వెళ్ళే అర్హత లభించినట్లుగా అనిపించింది.

ఇంగ్లీషులో వున్న సామెత ఒకటి అతన కా క్షణంలో గుర్తొచ్చింది—' ఎ గుడ్ బిగినింగ్ ఈజ్ హాఫ్ డన్ ' అని! తను అప్పుడే కార్యరంగంలో దిగిపోయినట్లే ననుకొని కొంచెం ఉలికిపాటుతో, కొంచెం సంభ్రమంతో, కొంచెం భయాందోళనతో, కొంచెం ఆశతో ఇల్లు చేరాడు.

ఇల్లు చేరాక మళ్ళీ ఓసారి ఆ పేపరు అందుకొని చదువుకున్నాడు. ఆ పేపర్లో ఆ వార్తే మరోసారి చదివాడు. ఆ వార్తల్లో దోపిడి జరిగిన సంగతి, డబ్బు పోయిన సంగతి మాత్రమే ఉండి. దోపిడీదారులు దొరికిన సంగతి లేకపోవటం అతని కెంతో సంతృప్తి కలగ జేసింది. బాంక్ దోపిడీ విషయమై పోలీసు దర్యాప్తు జరుగుతూందని ఉంది కానీ, నాగభూషణానికి ఈ దేశంలోని పోలీసు శాఖ మీద అపారమైన గురి వుంది. అందుకే అనుకున్నట్లు కార్యరంగంలో దూకటం అతని కెంతో ఆనందాన్ని కలగజేసింది.

ఆ తరవాత రోజు కొక్కసారి నాగభూషణం ఆ బాంకులోకి వెళ్ళేవాడు. ఎవరెవరు ఏయే క్షణంలో పనిచేస్తుంటారో, ఏఏ క్షణాలలో కొంచెం విశ్రాంతి తీసుకుంటారో, ఏ ఏ వ్యక్తుల మనస్తత్వం ఎలాంటిదో. ఎవ రెవరు ఏ ఏ పనులు చేస్తారో—ఇదంతా జాగ్రత్తగా గమనించసాగాడు. తన ప్రవర్తన ఎవరికీ ఏవిధమైన అనుమానం కలగకుండా ఉండే విధంగా శ్రద్ధ వహించ సాగాడు.

బ్రాంచ్ మేనేజరు తాళాలు యెక్కడ దాస్తాడో, అక్కౌంటెంటు తన తాళాలు ఎక్కడ ఉంచుతాడో అన్నీ ఆకళింపు చేసుకున్నాడు. సేఫ్ రూమ్ తలుపులు తీస్తే ఎన్ని రకాల అపాయాలు తన్ను చుట్టుముట్టుకోగలవో అన్నీ అవగాహన చేసుకున్నాడు. వీటన్నిటికీ విరుగుళ్లుకూడా తయారు చేసుకున్నాడు నాగభూషణం.